క్లుప్తంగా

ఇర్లపాడు చేపల చెరువు వేలంపాట



నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు చేపల చెరువుకు మంగళవారం అధికారులు గ్రామ సచివాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. 75 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుకు 2024–25, 2025–26 గడువు కాలానికి రూ.23,50,000లకు గ్రామానికి చెందిన పసల వెంకట సుబ్బారావు దక్కించుకున్నారు. వేలం పాటను ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఇన్‌చార్జి సర్పంచి గొల్లప్రోలు కోటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి మాధవి పర్యవేక్షణలో వేలం నిర్వహించారు. వేలంలో ఎనిమిది మంది పాల్గొన్నారు. గడిచిన రెండేళ్లలో రూ.20.10 లక్షలకు గ్రామానికి చెందిన ఆలూరి సాంబశివరావు చేపల చెరువు సాగు చేసుకోగా, ప్రస్తుత వేలం ద్వారా రూ.3.40 లక్షలు అదనపు ఆదాయం లభించినట్లయింది. హెచ్చుపాటదారైన పసల వెంకట సుబ్బారావు ప్రస్తుతం పాడిన పాటలో 3/4వ వంతు మొత్తాన్ని వేలం పాడిన రోజుననే, మిగిలిన మొత్తాన్ని వారం రోజుల్లో చెల్లించాలని పంచాయతీ కార్యదర్శి మాధవి తెలిపారు.

చిన్న షిరిడీలో దసరా నవరాత్రులు



వినుకొండ(నూజెండ్ల): హిమాలయ గురుజీ ఆశీస్సులతో వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి సాయి బృందావనం(చిన్న షిరిడీ)లో దేవీ శరన్నవరాత్రుల పూజలు 9 రోజుల పాటుగా నిర్వహించనున్నట్లు శాంతి ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు తెలిపారు. నిర్మాణంలో ఉన్న శాంతి ఆశ్రమంలోని మండపంలో ఉత్సవ మూర్తులతో విగ్రహాలకు దేవీ శరన్నవరాత్రుల పూజలు చేయనున్నట్లు తెలిపారు. రాజశ్యామల యాగంతో పాటు ప్రతి రోజూ పుష్ప అలంకరణ, అభరణ అలంకరణ పూజలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పెండేల మోహన్‌రావు, సెక్రటరీ కన్నెగండ్ల కోటేశ్వరరావు, పెండేల పుల్లారావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, సత్యం, రమేష్, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గణేశుని నిమజ్జనాలు



నాదెండ్ల: మండలంలో వినాయక నిమజ్జనాలు మంగళవారంతో ముగిశాయి. గణపవరంలో 1, కనపర్రు– 1 గణనాథుని విగ్రహాలను కోలాహలంగా ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా గ్రామాల పరిధిలోని వాగుల్లో నిమజ్జనం చేశారు. యువత బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. గణపవరం శాంతినగర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద చిన్నారుల కోలాట ప్రదర్శన, సంప్రదాయ నృత్య ప్రదర్శనలు స్థానికులను ఆకట్టుకున్నాయి.

జేఎన్‌టీయూఎన్ కళాశాలలో రక్తదాన శిబిరం



నరసరావుపేట రూరల్: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా కాకాని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్‌లో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని తెలిపా రు. రక్తం సరైన సమయంలో అందక అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారు ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. శిబిరంలో వందమంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రా మ్ ఆఫీసర్ డాక్టర్ జీపీ రాజు పాల్గొన్నారు.

రషీద్ హత్య కేసులో కోర్టులో వాదనలు నేడు

వినుకొండ(నూజెండ్ల): సంచలనం కలిగించిన పల్నాడు జిల్లా వినుకొండ రషీద్ హత్య కేసులో వాదనలు వినిపించేందుకు రాష్ట్ర మాజీ అదనపు అడ్వకేట్ జనరల్, హైకోర్టు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి బుధవారం వినుకొండ రానున్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వద్దకు ఉదయం 9గంటలకు రానున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

స్వచ్ఛతా హి సేవలో భాగస్వాములు కావాలి

నరసరావుపేట రూరల్: స్వచ్ఛతను ప్రతి ఒక్కరూ జీవన విధానంగా మార్చుకోవాలని మండల పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారి పుసర్తి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని లింగంగుంట్లలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రాజుపాలెం పాఠశాల విద్యార్థులు మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామస్తులకు గ్రామ స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేవీ ప్రసాద్ పాల్గొన్నారు. కాకానిలో నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో కన్సల్టెంట్ నవీన్‌కుమార్, మండల కోఆర్డినేటర్ టి.అయ్యపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు. విద్యార్థులు, పారిశుద్ధ్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

హసన్నాయునిపాలెంలో..

వినుకొండ(నూజెండ్ల): స్వచ్ఛతా హి సేవ- 2024 కార్యక్రమంలో భాగంగా వినుకొండ మండలంలోని హసన్నాయునిపాలెంలో మానవహారంగా ఏర్పాడ్డారు. పాఠశాల ఆవరణలో సామూహిక పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమం అక్టోబర్ ఒకటి వరకు నిర్వహించి 2న గాంధీ జయంతిని ఒక పండుగ వాతావరణంలో జరుపుకోవాలని పలువురు కోరారు. కార్యక్రమంలో కె.మంగమ్మ, వీరాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి



శావల్యాపురంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

షేక్ జానీబాషా, సీహెచ్ఓ ప్రమీల, ఆశ వర్కర్ పద్మ, మండల కోఆర్డినేటర్ ప్రభాకరరావు, ఉపాధ్యాయురాలు షాబిరుణ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవను విజయవంతం చేయండి

శావల్యాపురం: స్వచ్ఛతా హి సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ పి.సీతారామయ్య కోరారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మండల, గ్రామ స్థాయి అధికారుల సారథ్యంలో ర్యాలీతో పాటు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రతిజ్ఞ మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అక్టోబరు 2వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్నీ పంచాయతీల్లో పచ్చదనంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హి సేవ కార్యకమం అమలు చేసిందన్నారు. తహసీల్దార్ వేముల వెంకట నాగరాజు, ఈఓపీఆర్డీ పి.సుగుణ పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో..

బొల్లాపల్లి: మండల కేంద్రంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం భాగంగా ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రతిజ్ఞలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచగలిగితే ఆరోగ్యపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమం ఉద్దేశమే స్వచ్ఛతా హి సేవ అని ఎంపీడీఓ షేక్ గౌసియాబేగం తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ షేక్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

రొంపిచర్లలో..

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్టు సెంటర్‌లో 'స్వచ్ఛతా హి సేవ' కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాధ్యుబాబు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌ను సాధించే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలు చేశారు. ఈ మేరకు విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ తోటి వారిలో అవగాహన కల్పించాలన్నారు. తడి పొడి చెత్తను వేర్వేరుగా ఉంచాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సుభాని, సర్పంచి టి.జయమ్మ, పడాల చక్రారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించాలి

చిలకలూరిపేట: పారిశుద్ధ్యం మెరుగు, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కోరారు. స్వచ్ఛతా హి సేవలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సీహెచ్ గోవిందరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇస్మాయిల్, శ్రీనివాసరావు, రమణారావు పాల్గొన్నారు.


వినుకొండలో అవగాహన కల్పిస్తున్న అధికారులు


బొల్లాపల్లిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు


రాజుపాలెం పాఠశాల విద్యార్థుల మానవహారం



చిలకలూరిపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న చైర్మన్

మహమద్ ప్రవక్త త్యాగం మానవాళికి మార్గదర్శకం

- పట్టణంలో ముస్లింల ఊరేగింపు
- సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: హజరత్ మహమద్ ప్రవక్త ఖురాన్ ద్వారా ప్రపంచానికి అందించిన శాంతి, సహనం, త్యాగం అనే సందేశాలు మానవాళికి మార్గదర్శకాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ వేడుకల సందర్భంగా పట్టణంలోని ముస్లింలు మంగళవారం భారీ ర్యాలీ(జల్సా) నిర్వహించారు. ఈ ర్యాలీ నాయబ్ బజార్ పెద్ద మసీదు నుంచి మల్లమ్మ సెంటర్, గాంధీ చౌక్ సెంటర్, గడియారం స్తంభం సెంటర్, మునిసిపల్ కార్యాలయం మీదుగా పట్టణ ప్రధాన వీధులలో ర్యాలీ సాగింది. ర్యాలీలో ముఫ్తి మహమ్మద్ రైస్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రాము, రాష్ట్ర బులియన్ మర్చంట్ అధ్యక్షులు కపిలవాయి విజయ్‌కుమార్ సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ర్యాలీని ఉద్దేశించి డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ మహమద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలంటూ మిలాద్‌ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ర్యాలీలో మాజీ కౌన్సిలర్లు షేక్ మస్తాన్‌వలి, జానీ మౌలాలి, వైఎస్సార్ సీపీ మైనార్టీ జిల్లా కార్యదర్శి సయ్యద్‌ఖాదర్‌బాషా, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి షేక్ ఆద్రూఫ్, సమైక్య ఆంధ్రప్రదేశ్ ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ జిలానిమాలిక్, ఇమామ్ బాషా, నన్నేసా, చాంద్ బాషా, బాజీ, జలీల్, రహమత్ అలీతో పాటు నియోజకవర్గంలోని ఆయా మసీదుల పేష్ మామ్‌లు, ముఫ్తిలు, మౌలానాలు, మౌజన్‌లు, ముస్లిం మతపెద్దలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, సుమారు 500 మంది ముస్లింలు పాల్గొన్నారు. అనంతరం నయాబ్ బజార్ పెద్ద మసీదు వద్ద అన్నదానం నిర్వహించారు.


ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

యోగాసన పోటీలలో బహుమతులు

నరసరావుపేట రూరల్: జిల్లా స్థాయి యోగ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు తిరుమల ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ మంగళవారం తెలిపారు. యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు ఈనెల 15వ తేదీన కృష్ణ చైతన్య స్కూల్‌లో నిర్వహించినట్లు వివరించారు. దాదాపు 200 మంది పాల్గొన్న పోటీలలో తమ కళాశాల విద్యార్థులు పి.ఏసుమరియమ్మ, పి.కపిల్ ప్రథమ స్థానం, ఎం.వంశీకృష్ణ ద్వితీయ స్థానం సాధించినట్లు పేర్కొన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను కళాశాల యోగా ట్రైనర్ రంగలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.


బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట ఈస్ట్: రక్తదానం చేయటం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల, వాగ్దేవి డిగ్రీ కళాశాల, జేఎన్‌టీయూ–ఎన్ ఇంజినీరింగ్ కళాశాలల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. శిబిరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు మాట్లాడుతూ, ప్రమాదాలకు గురైన ఎంతోమంది సకాలంలో రక్తం లభించక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కె.జగన్మోహన్‌రెడ్డి, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, పివిఎం శరత్‌బాబు, చేగు వెంకటేశ్వరరావు, బి.మురళీధరరావు పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

అనంతపద్మనాభ స్వామికి ప్రత్యేక పూజలు

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్ సిరి అపార్టుమెంట్‌లో ఏలూరి ప్రసాద్ గృహంలో మంగళవారం నిర్వహించిన శ్రీ అనంతపద్మనాభస్వామి వారి వ్రతం ఘనంగా నిర్వహించారు. దీనిలో మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ కారసాని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదం స్వీకరించారు. పూజకు వచ్చిన గోపిరెడ్డి, కారసానిని దుస్సాలువతో ప్రసాద్ సత్కరించారు. 15వ వార్డు ఇన్‌చార్జి గోపీకృష్ణ, గురుమూర్తి పాల్గొన్నారు.

క్రీడల్లో బాలికలు రాణించటం అభినందనీయం

శావల్యాపురం: జాతీయ క్రీడల్లో బాలికలు రాణించటం అభినందనీయమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి అన్నారు. స్థానిక పాఠశాలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా విద్యార్థినుల అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీలు ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు బాలికల విభాగంలో సబ్ జూనియర్స్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. పాఠశాలలో ఇంటర్ చదువుతున్న ముట్లూరి లూథియా, వేముల దివ్య, బి.దేవమణి, ఆర్.రత్నకీర్తన, యు.లలితా, సీహెచ్ హర్షిత, బి.రవళి క్రీడా పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ముట్లూరి లూథియా, బి.దేవమణి రాష్ట్ర జట్టుకు ఎంపికై ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు హరియాణాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. బి.దేవమణికి స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు, బెస్ట్ ప్లేయర్ అవార్డు దక్కిందన్నారు. క్రీడా పోటీల్లో మంచి ప్రతిభ చూపించి పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిని ప్రత్యేకంగా అభినందించారు. స్టాఫ్ సెక్రటరీ సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, శ్రీకాంత్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్ బాలికల జట్టును ప్రత్యేకంగా అభినందించారు.


ఎంపికైనా బాలికల జట్టుతో పాఠశాల ఉపాధ్యాయులు

ఘనంగా విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో వినుకొండ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం కడియాల ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, అనంతరం విశ్వకర్మ పతాకావిష్కరణ, భగవాన్ విరాట్ విశ్వకర్మ పూజ, విశ్వకర్మ యజ్ఞం, నివేదన మంగళహారతి, విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మక్కెనను ఘనంగా దుశ్శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆది గురువు విరాట్ విశ్వకర్మ భగవాన్ సృష్టికి మూలం అని, పరమాత్మ విశ్వకర్మ 5 ముఖాలతో పది చేతులతో స్వయంభుగా అవతరించిన రూపం వీరిది, దృష్టి కలిగిన అమిత శక్తి కలవాడు, మహాభారతం ఈయనను వేయి కలలకు అధినేతగా అభివర్ణించారని అన్నారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వీరాంజనేయరెడ్డి, డి.కొండాచారి, రెడ్డి వెంకటరత్నం పాల్గొన్నారు.


ఘనంగా విశ్వకర్మ విశ్వశాంతి వేడుకలు

శావల్యాపురం: మండలంలోని పోట్లూరులోని గాయత్రి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో విరాట్ విశ్వకర్మ విశ్వశాంతి యజ్ఞ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గాయత్రిదేవి అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు సొలస శివయ్య శాస్త్రి, ఉమ్మడిసింగ్ కాళేశ్వరాచారి శాస్త్రి సారథ్యంలో దంపతులతో హోమాలు, అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు వైభవంగా చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు పులుకూరి సురేష్, కుమ్మరిపల్లి బ్రహ్మం, పులుకూరి శ్రీనివాసరావు, కొండ్రముట్ల రుద్రమాచారి, రావి నూతల వెంకటేశ్వర్లు, పులుకూరి వెంకట కోటేశ్వరరావు పాల్గొన్నారు.


స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన

ఘనంగా గణపతి పూజ

నరసరావుపేట ఈస్ట్: టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చవితి పందిరిలోని గణనాథుడిని మంగళవారం 1,108 బత్తాయి పండ్లతో సహస్ర అష్టోత్తర నామ పూజ నిర్వహించారు. బుధవారం ఉదయం గరికతో గణపతి పూజలు నిర్వహించి సాయంత్రం నిమజ్జనానికి తరలించనున్నట్లు శ్రీమహావీర గణపతి ఉత్సవ కమిటీ కన్వీనర్ వనమా పవన్‌కుమార్ తెలిపారు. కాగా, కాకుమాను బజార్‌లో ఏర్పాటు చేసిన గణనాథుడిని సోమవారం రాత్రి నిమజ్జన కార్యక్రమం పూర్తి చేశారు.


బత్తాయిపండ్లతో గణనాథుడికి పూజ


మట్టి వినాయకుని నిమజ్జనం నేడు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలోని గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో వినాయక చవితి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని విగ్రహానికి 11వ రోజు పూజలను మంగళవారం నిర్వహించారు. గరిక పత్రితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం వినాయకునికి నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే బెహరావారిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుని 11 కేజీల లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన శిగంశెట్టి కనకయ్య రూ.35 వేలకు దక్కించుకున్నారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించిన అనంతరం నకరికల్లు మండలం చల్లగుండ్ల అడ్డరోడ్డులోని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.


నిమజ్జనానికి తరలిన కాకుమాను బజారు గణపతి

దాడిచేసిన నిందితులను అరెస్టు చేయాలని వినతి

నరసరావుపేట: యలమంద గ్రామస్తుడు ఎస్.సుబ్బారావుపై దాడి చేసిన తెలుగుదేశం పార్టీ వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్షలు అమలు చేయాలని మంగళవారం ప్రజాసంఘాల నాయకులు బాధితుడితో కలసి ఆర్డీఓ పి.సరోజినీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడు సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ తనపై జరిగిన దాడిని రూరల్ సీఐ, నేను గుంటూరులో ఉంటున్నానని, ఘటనపై తాను నాలుగు రకాలుగా చెప్పినట్లుగా అనటం సరైందికాదని అన్నారు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తన వద్దకు కానిస్టేబుల్ వచ్చి స్టేట్‌మెంట్ తీసుకొని ఎస్ఐ దగ్గరికి తీసుకెళ్లి మాట్లాడించి న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు. ఎన్నికల అనంతరం టీడీపీ వర్గీయులు ఇంటిపైన దాడిచేసి ఇల్లు ధ్వంసం చేయడంతో గ్రామం ఖాళీ చేసిన వారిలో తానూ ఉన్నానని, చల్లగుండ్ల, నరసరావుపేట ప్రాంతాల్లో ఉంటున్నానని చెప్పారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) రాష్ట్ర నాయకుడు నల్లపాటి రామారావు మాట్లాడుతూ జరిగిన ఘటనపై రూరల్ సీఐ బాధితులతో మాట్లాడకుండానే సుబ్బారావు నాలుగు రకాలుగా మాట్లాడుతున్నాడని అనడం సరైందికాదని అన్నారు. సుబ్బారావుపై దాడి చేసిన వాళ్లు ఎవరో తేల్చాలని కోరారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ పేద రజక కుటుంబానికి చెందిన సుబ్బారావుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, ప్రభుత్వ అధికారులు ఎవరు అధికారంలో ఉంటే వాళ్లకి అనుకూలంగా కాకుండా న్యాయంగా వ్యవహరించాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, పౌరహక్కుల సంఘ జిల్లా జిల్లా నాయకులు శిఖినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఆర్డీఓ సరోజనీకి వినతిపత్రం అందజేస్తున్న బాధితుడు, ప్రజాసంఘాల నాయకులు

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె బాట

శావల్యాపురం: జీఓ నంబరు 85ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యులు మంగళవారం సమ్మెకు దిగారు. ఈసందర్భంగా శావల్యాపురం మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు పూర్తిస్థాయిలో బంద్ అయ్యాయి. జీవో నంబరు 85 వలన ప్రభుత్వ వైద్యులకు పూర్తిస్థాయిలో అన్యాయం జరుగుతుందని తమ ఆవేదన వ్యక్తం చేశారు.

వరద బాధితులకు వైఎస్సార్‌సీపీ నాయకుల సాయం

నరసరావుపేట: విజయవాడ వరద బాధితుల సహాయం మేము సైతం అంటూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు స్పందిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం పదోవార్డు మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు వరద బాధితుల సహాయార్థం బెడ్ షీట్లు, చీరలు మాజీ శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి పార్టీ కార్యాలయంలో అందజేశారు. అలాగే 33వ వార్డు ఇన్‌చార్జి మర్రిపూడి రాంబాబు ఆధ్వర్యంలో ఆ వార్డు నాయకులు బెడ్‌షీట్లు అందజేశారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ వాయిదా

రొంపిచర్ల: మండలంలో అన్ని గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించాల్సి ఉన్న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం వాయిదా పడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ నులి పురుగులను నిర్మూలించే ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వైద్యాధికారులు సమ్మెకు దిగడంతో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు సమాచారం.

తాగునీటి సరఫరాలో నేడు, రేపు అంతరాయం

నరసరావుపేట: శాంతినగర్ ఫిల్టర్ పాయింట్‌లో మరమ్మతుల నిమిత్తం పట్టణంలోని కొన్ని ప్రదేశాలకు రెండు పూటలా తాగునీరు సరఫరా నిలిపివేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18వ తేదీ సాయంత్రం, 19వ తేదీ ఉదయం ప్రకాష్‌నగర్, రామిరెడ్డిపేట, అరండల్‌పేట, వరవకట్ట, బీసీ కాలనీ, చాకిరాల మిట్ట, చంద్రబాబునాయుడు కాలనీ, పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీటి సరఫరా జరగదన్నారు. 19వ తేదీ సాయంత్రం నుంచి యథావిధిగా సరఫరా ఉంటుందని చెప్పారు.

స్టాఫ్ నర్సులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలి

- ప్రజాసంఘాల డిమాండ్
- ఆందోళనకు మద్దతు


ఆందోళనకు మద్దతు తెలుపుతున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: స్టాఫ్ నర్సులను పర్మినెంట్ చేసి వాళ్ల న్యాయమైన సమస్యను పరిష్కరించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గత 15 రోజులుగా ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు చేస్తున్న పోరాటంలో మంగళవారం ప్రజాసంఘాల నాయకులు పాల్గొని వారి పోరాటానికి మద్దతు పలికారు. వారిని ఉద్దేశించి దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 వేల మంది కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకులు అధికారంలోకి రాకముందు పర్మినెంట్ చేస్తామని చెప్పి అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టాఫ్‌నర్స్‌ను ఇబ్బంది పెట్టేందుకు రకరకాల జీఓలు తీసుకువచ్చి ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని అన్నారు. ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్స్ మధ్య విభేదాలు సృష్టించి స్టాఫ్ నర్సులు చేస్తున్న ఉద్యమానికి సంఘీభావం లేకుండా కుట్రలు పన్నుతున్నారని ఈ విధానాలు మానుకోవాలని హితవు పలికారు. పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, పౌరహక్కుల సంఘ నాయకులు శిఖినం చిన్న, బీసీ సంఘం నాయకులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.